# శకునపక్షి



ప్రాచార్య యస్వీ జోగారావు

రంగనాయకారాజీవాలోచనా
రామ తెల్ల వారేను మేలుకో
సంగీత లోలుడా సరస
దయాళుడా
సౌందర్య శ్రీరామ మేలుకో
మూడు లోకములు యిమిడి
యున్నాబొజ్జా
వాడి యున్నాది మేలుకో

అని సాతాని గాత్రం గడప గడపను గడగడలాడించేస్తోంది. అతగాడి వెంటనే "కోడి కూసేను తెల్లవారెను"! అంటూ చెక్క భజన దాసరి కూడా తయారయాడు.

అది ధనుర్మాసం. వెలగించు పెట్టిన జంగమయ్య ఘంటానాదం, శంఖారావం కూడా వినిపిస్తున్నాయి. ముద్దబంతి పువ్వులాంటి ఆడపిల్ల లంతా లేచి మునివాకిళ్లలో కళ్లాపులు చల్లి ముగ్గులు పెడుతున్నారు.

"అంబ పలుకు జగదంబ పలుకు! పంచవన్నెల రామచిలుకా పలుకు" అంటూ ఢమరుకం వాయిస్తూ శకునపక్షి ఒక ఇంటి ముందు ఆగాడు, "పొద్దు పొడుస్తోంది. నేను పోవాలి తల్లీ! జాలం శాయకు" అంటువ్నాడు. ఒక ఇల్లాలు బయటికి వచ్చి "పొద్దుపొడిస్తేనేం కొంపేం మునిగిపోతుంది?" అని ప్రశ్నించింది. "జోస్యం చెప్పడానికి వచ్చినప్పుడు సూర్యుడి మొగం చూడకూడదు" అని పెద్దలన్నారు అన్నాడు. "పోనీ నాకు సూర్యుడు కనిపిస్తాడా?" అందామె.

"నీ సూరీడు వేరులే తల్లీ" అన్నాడు శకునపక్షి.

"నా సూరీడెక్కడున్నాడు ఎప్పుడొస్తాడు" అని అడిగిందామె. ఇరుగు పొరుగుల ముగ్గులు పెడుతున్న ముద్ద బంతి పువ్వులు నవ్వుతున్నాయి. "చెబుతాను చెబుతాను ఒక పట్టుగుడ్డపాత ఇలా పారెయ్యవమ్మా" అన్నాడు శకునపక్షి. ఆవిడ లోపలికెళ్ళి ఒక బరంపురం పాత్తి ధావళి తెచ్చి ఇచ్చింది. "తూర్పుకేసి వెళ్ళాడు. పడమటికి తిరిగాడు. దారిలో వున్నాడు దాపులో వున్నాడు. సంకురేతిరికి నీ కాపురం సల్లగుండాల" అని వెళ్ళిపోయాడు శకునపక్షి.

ముగ్గులు పెట్టేశాక ఆడపిల్లలందరూ ఇంకా ఏదో పని వున్నట్టు ధవళవారి అరుగుమీదికి చేరుకున్నారు. గువ్వకరిగా కూర్చున్నారు. ఆ శకునపక్షిగాడు చెప్పిందేమిటంటే ఏమిటని అనుకుంటున్నారు. అందులో ఒక ఆరిందా కాంతమ్మగారి కథంతా ఇలా చెప్పింది. "అసలు చంద్రమ్మతోనే పెళ్లి కావలసింది సూర్యంగారికి. కాంతమ్మతో అయింది. సూర్యంగారి సంసారంలో ప్రారంభమయ్యాయి చిటపటలు. మరీ చవటాయ గాకపోయినా చేతులు రెండూ కలిస్తే కదా చప్పట్లు. ఆ బెడద ఎంతో కాలం సహిస్తూ వచ్చారు సూర్యంగారు. అది అలుసుగా తీసుకొని రోజా కాల్చుకు తిన సాగింది కాంతమ్మ. నాలుగు రోజుల్లో అది కాస్తా అమాందస్తా అయిపోయింది. ఇక భరించలేకపోయాడు సూర్యంగారు. ఒకనాడు సూర్యంగారు, చంద్రమ్మ కూడబలుక్కుని ఈ వూరి నుంచి లేచిపోయారు.

"నీ బాధపడలేక నారాయణమ్మ నే
రంగ మెల్లిపోతానే నారాయణమ్మ
నే రబ్బరెల్లిపోతావే నారాయణమ్మ"

అన్నట్టు సూర్యం, చంద్రమ్మ రబ్బరు (మలేషియా) వెళ్ళిపోయారని వినికిడి. ఇది మా బామ్మ చెప్పిన కథ. ఏడేళ్లయిపోయె. లబోదిబోమంటోంది కాంతమ్మ. పాపం ఏడెనిమిదేళ్ళ కొడుకు విస్సాయి తల్లి ధనరుకి తండ్రి తట్టుకోలేక ఇంటి నుంచి వెళ్లిపోవడం వల్ల మనసు పాడు చేసుకున్నాడు. మతి కూడా పోయింది వాడికి మాట పడిపోయింది. తల్లిని రక్కేసి కొట్టినంత పని చేస్తుంటాడు. అందుకూ కాంతమ్మ ఈ వేళ శకునపక్షి నడిగింది సూర్యం గారెప్పుడు వస్తాడని"

"ఎంత అఘాయిత్యం!" అని నోరు నొక్కుకున్నారు పిల్లలంతా.

రంగం నీళ్ళు పడక మరేదైనా ఉద్యోగం చూసుకుందామని సూర్యం చంద్రమ్మను తీసుకొని బొంబాయి వెళ్ళాడు. అక్కడో కంపెనీలో మంచి ఉద్యోగమే దొరికింది. కానీ కొడుక్కి మతిపోయిందని కర్ణాకర్ణిగా విన్నాడు. రాజీనామా చేసి మరో వారం రోజుల్లో వతనుకు చేరుకున్నాడు. చంద్రమ్మను ఒక లాడ్జిలో రహస్యంగా వుంచి ఇంటికి వచ్చాడు. కాంతమ్మ కాళ్ళు కడిగి నెత్తిన నీళ్ళు చల్లుకుంది.

విస్సాయుకు సంతోషం పాల పొంగులా వచ్చింది.

ఆ పొంగులో నోరు పెగిలింది.

బావురుమని తండ్రిని కావలించుకున్నాడు.

పెద్ద పండుగ పేరు నిలబెట్టింది.

సంకురాత్రి వెళ్ళిపోయింది.

శివరాత్రి వెళ్ళిపోయింది.

శివరాత్రితో శివ శివా మని పోయింది చలి

లాడ్జిలో వున్న చంద్రమ్మ సంగతి ఎలాగో పసికట్టింది కాంతమ్మ. కాకి మీద, పిచుక మీద తిట్ల పర్వం ప్రారంభమయింది. కాంతమ్మ ధ్వని, శ్లేషలు సహించాడు సూర్యం. కారాలూ మిరియాలు నూరుతోంది. భరించాడు సూర్యం. కచ్చలో కందులు వేపుతోంది. మొగం మీద పేడ నీళ్ళు చల్లుతోంది, సంహించాడు, భరించాడు. ఒకనాడు సూర్యం లాడ్జీకి వెళ్ళి వచ్చిన ఆరా తీసింది. ఆ ఫలంగా కాలవేసిన గరిటెతీసి తలమీద ఫడేల్ మనిపించింది. అయినా తల తడుముకుంటూ కూచున్నాడు. కానీ పల్లెత్తు మాటనలేదు సూర్యం. విస్సాయి లేచాడు. "నువ్వెన్ని చేసినా ఇంక ఈ ఇంటి లోంచి నాన్నగారు పోరు, పోతే నువ్వే పో" అని కసిదీరా అన్నాడు. "నాన్నా దానివే వుండనీ, మనమే పోదాం రా" అని సూర్యం కొడుకును, చంద్రమ్మను తీసుకుని ఎక్కడికో వెళ్ళిపోయాడు.

●